నేడు మాసశివరాత్రి పూజలు

సనత్‌నగర్: కార్తీకమాస విశేష పూజ కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము 4 నుంచి 9 గంటల వరకు సామూహికంగా అభిషేకాలు 9.30 నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అనంతరం బిల్వార్చన, పుష్పార్చన ఉంటాయన్నారు. 12న ఉదయం 9 గంటలకు రుద్రహోమం, పూర్ణాహుతితో కార్తీక మాస విశేష పూజలు ముగుస్తాయన్నారు.

రాజకీయాలకతీతంగా సామాజిక సేవ



టెంట్‌హౌజ్ సామగ్రి అందిస్తున్న శ్రీగణేష్

కంటోన్మెంట్: రాజకీయాలకతీతంగా ఎస్‌జీఎఫ్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 6వ వార్డులోని మహాత్మానగర్ ప్రజలకు టెంట్ హౌజ్ సామగ్రిని ఆయన అందజేసి మాట్లాడారు. బస్తీ వాసులు ఎలాంటి శుభకార్యాలు, వివిధ పూజాది కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ సామగ్రిని అందించానన్నారు. బీజేపీ అభ్యర్థిగా ఇటీవల పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ తాను ప్రజలకు మాత్రం సేవ చేస్తూ నిరంతరం వారితోనే ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్, స్థానిక నాయకులు ప్రేమ్‌కుమార్, పోచయ్య, రాజు, స్వరూప, ప్రతీక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



అమీర్‌పేట: ప్రతి ఒక్కరికీ సేవా గుణం కలిగి ఉండాలని సంఘ సేవకులు కరణం చిన్న రంగయ్య అన్నారు. కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్కులో ఆదివారం శ్రీ మాతా సేవా సమితి సనత్‌నగర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. మాతా సేవా సమితి నిరుపేదలకు అండగా నిలుస్తుందని ఆసక్తి ఉన్న రంగాల్లో మహిళలకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు డాక్టర్ విజయ కుసుమ, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు దాసరి గీత, ఎం.పుష్పలత, కుసుమ జ్యోతి, కమల, కళాప్రియ, రాధిక పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న దృశ్యం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదల వైద్య ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రావి-వేప చెట్టుకు కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లాస్యనందిత

రసూల్‌పురా: రసూల్‌పురా కట్టమైసమ్మ ఉప్పలమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన రావి-వేప చెట్టు కల్యాణోత్సవ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివాహ దోషమున్న వారు సాంప్రదాయ పద్ధతిలో చెట్లకు కల్యాణం జరిపిస్తే దోషం తొలగిపోతుందన్నారు. నివేదిత, టీఎన్ శ్రీనివాస్, కుమార్ ముదిరాజ్, దేవులపల్లి శ్రీనివాస్, అంజనేయులు, శ్యాంరెడ్డి, సోమనర్సయ్య పాల్గొన్నారు.

పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న కవి సురేందరు

లాలాపేట: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పగిడిపల్లి సురేందరు కణిక ఆత్మీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం రవీంద్రభారతిలో కణిక సాహిత్య సామాజిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఉత్తమ రచనకు సురేందర్‌కు ఈ పురస్కారానికి ఎంపిక య్యారు. కణిక అధ్యక్షురాలు రమాదేవి కులకర్ణి, నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, రచయిత్రి ఐనంపూడి లక్ష్మీ, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం తదితరులు చేతుల మీదుగా సురేందర్‌ను శాలువాతో సత్కరించి పురస్కారం అందజేశారు.



షెల్టర్లు లేక.. బస్సులు ఆగక!

- అడ్డగుట్టలో బస్ షెల్టర్లు లేక ఆగని బస్సులు
- నడి రోడ్డుపై నిలబడుతున్న ప్రయాణికులు
- ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

అడ్డగుట్ట: ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలో దినదినాభివృద్ధి జరుగుతున్నప్పటికీ బస్ షెల్టర్ల విషయానికి వస్తే చెప్పుకోదగిన పురోగతి లేదు. అడ్డగుట్ట డివిజన్ నుంచి బస్సుల్లో ప్రయాణించే వారు బస్సు కోసం వేచి ఉండడానికి నిలువ నీడలేని పరిస్థితి ఉంది. ప్రతిరోజు వివిధ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేవారు చాలా మంది ఉంటారు. అయితే బస్సుల కోసం ఎదురుచూస్తూ వీళ్ల కోసం బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమని ప్రయాణికులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో సుమారు పది బస్టాప్‌లు ఉన్నాయి. కాని ఏ ఒక్క బస్టాప్‌లో కూడా షెల్టర్ లేదు. దీని కారణంగా బస్సుల కోసం ఎదురుచూసే వారంతా నడిరోడ్డుపై వచ్చి బస్సుల కోసం ఎదురు చేస్తున్నారు. షెల్టర్ లేకపోవడంతో ఒక్కోసారి కొన్ని బస్సులు కూడా ఆపడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగుట్ట బస్టాండ్ వద్ద మొదలుకొని తుకారాంగేట్, న్యూ బ్రిడ్జ్, రైల్వే బాయ్స్, లాలాగూడ, శాంతినగర్ సుమారు పది బస్టాండ్‌ల లోషెల్టర్లు లేక ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. లాలాగూడలో ఉన్న ఒక్క బస్ షెల్టర్ కూడా పూర్తిగా దుర్గంధ భరితంగా ఉండడంతో అందులో ప్రయాణికులు వేచి ఉండలేక రోడ్డుపైకి వచ్చి బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు.

హామీలిచ్చి విస్మరిస్తున్నారు..

కేవలం ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలిచ్చిన నాయకులు ఎన్నికల అనంతరం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగుట్టకు 25 ఏళ్ల క్రితం నుంచే ఆర్టీసీ సౌకర్యం కలిగింది. ఏళ్లు గడుస్తున్నా ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటి వరకు డివిజన్‌లో ఒక్క బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేరు. అడ్డగుట్ట డివిజన్ నుంచి నిత్యం పనులకు వెళ్లే వాళ్లు వేల సంఖ్యలో ఉంటారు. వారి పనుల నిమిత్తం బస్సులోనే వెళ్తుంటారు. అసలే, అడ్డగుట్టకు బస్సు సౌకర్యం అంతంత మాత్రమే, దీనికితోడు ప్రయాణికులు బస్టాండుల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది.

వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు..

ప్రయాణికుల్లో వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వికలాంగులు, మహిళలు అనేక మంది ఉంటారు. బస్సు కోసం వేచి చూసే సమయాల్లో కూర్చోవడానికి నిలువ నీడ కూడా లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి, వర్షాకాలంలో నానా ఇబ్బందులు తలెత్తుతాయని వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా బస్ షెల్టర్ ఏర్పాటు చేయడానికి ఏ ఒక్క నాయకుడు, సంబంధిత అధికారి చొరవ తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రతిరోజు ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్తా. ఆలస్యంగా వచ్చే బస్సులతో అదే విధంగా బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బస్ షెల్టర్ ఉంటే కాసేపైన కూర్చునేందుకు వీలుండేదది. అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్న సుమారు పది బస్టాప్‌లలో ఎక్కడ కూడా బస్ షెల్టర్ లేదు. షెల్టర్లు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.
–శ్రీకాంత్, ప్రయాణికుడు

కనుల పండువగా కార్తీక వన సమారాధన



సమారాధనలో పాల్గొన్న భక్తులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ కొత్తా కామకోటి కల్యాణమండపంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. హెచ్‌ఎంటీ బ్రాహ్మణ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నగర నలుమూలల నుంచి ఉద్యోగ కుటుంబీకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సామూహిక అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంటీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం ప్రతినిధులు సాయిప్రసాద్, కేఎస్ఆర్ మూర్తి, పీఎల్ ప్రసాద్, రాందాస్, పుచ్చా ప్రసాద్, మురళి, బాలభాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప భక్తిగీతాలు ఆలపిస్తున్న మోహన్ భాగవతార్ బృందం

చిలకలగూడ : శ్రీనివాసనగర్ అయ్యప్ప భక్తసమాజం ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప నామ సంకీర్తన విభావరి, మహా పడిపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, సహస్రనామార్చన, మహాదీపారాధన, అన్నప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కేరళకు చెందిన మోహన్ భాగవతార్ బృందం ఆలపించిన అయ్యప్ప నామా సంకీర్తన, భజన గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. లోక కల్యాణార్థం ప్రతిఏటా అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసనగర్ అయ్యప్ప భక్తసమాజం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో భక్తసమాజం సభ్యులు లక్ష్మీనారాయణ, బాలభాస్కర్, ఆత్మరామ సూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్ హాజరయ్యారు.

అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ నాయకులు

లాలాపేట: అయ్యప్ప మాలధారులకు లక్కీ ట్రేడర్స్ నిర్వాహకులు విట్టి జగన్‌రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో లాలాపేటలోని లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవాలయంలో 41 రోజుల పాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాల్‌రాజు గుప్తా తెలిపారు. గురుస్వామి ఎల్ఎల్‌బీ శ్రీనివాసులు గౌడ్, పలువురు అయ్యప్ప స్వాములతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామిని పూజించడం ద్వారా జీవితంలో అన్ని శుభాలే కలుగుతాయన్నారు. లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవాలయంలో ప్రతి రోజు నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు వెంకటేష్, శంకర్‌రెడ్డి, గణేష్‌యాదవ్, రమేష్, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



బౌద్ధనగర్ డివిజన్‌లోని అల్లాడి రాజ్‌కుమార్‌నగర్‌లో మూడు వారాలుగా పేరుకుపోయిన చెత్తతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారిందిన స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలో నుంచి తీసిన వ్యర్థాలను సైతం ఇక్కడే పారబోస్తుండటంతో దుర్వాసనతో వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –బౌద్ధనగర్

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23 బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 34, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి



శ్రీనాథ్, సర్కిల్ 9-ఏఎస్‌వో


రాంగోపాల్‌పేట్: రేషన్‌కార్డుల్లో పేర్లున్న ప్రతి ఒక్కరు రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-కేవైసీని నమోదు చేసుకోవాలని సర్కిల్-9 ఏఎస్‌వో శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కేవలం 60 శాతం మంది మాత్రమే కేవైసీ అప్‌డేట్ చేసుకున్నారన్నారు. రేషన్‌కార్డులో పేరున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, మరికొంత మంది చనిపోయారని కానీ ఇంకా వాళ్ల పేరు మీద రేషన్ సరుకులు తీసుకుంటున్నారని అందుకే ప్రభుత్వం ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశాలించించదన్నారు.

శుభాకాంక్షలు



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర నూతన వైద్యం, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: అనునిత్యం విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలపై సోషల్ మీడియా వేదికగా పోరాటం చేస్తున్న మహిపాల్ యాదవ్‌ను ఆదివారం ఓయూ క్యాంపస్‌లో కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ అధికార ప్రతినిధి బోనాల నగేష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించండి

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సమాచార హక్కు కమిషనర్ లాంటి కీలకమైన నియామకాలను వెంటనే చేపట్టాలని జన తెలంగాణ రైట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డెం శ్యామ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టు ద్వారా వినతి పత్రం పంపించారు. మానవ హక్కులు హరించినప్పుడు ప్రజలు కమిషన్‌ను ఆశ్రయించి కొంత ఊరట, న్యాయం పొందే వీలుందని కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం నెలల తరబడి చైర్మన్‌తో పాటు జ్యుడీషియల్, నాన్ జ్యుడీషియల్ సభ్యులను నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని అధికారుల నుంచి పొందేందుకు ఏర్పాటు చేసిన సమాచార హక్కు కమిషనర్ పోస్టు కూడా ఖాళీగా ఉందని, అలాగే సహచర కమిషనర్లను కూడా ఇంత వరకు నియమించలేదని తెలిపారు. దీంతో అధికారుల నుంచి సమాచారం అందకపోతే కమిషనర్ దగ్గరకు వెళ్లి న్యాయం పొందే అవకాశం ప్రజలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇలాంటి కీలకమైన పోస్టుల విషయంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తూ వస్తుందని ఇటీవల ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజల హక్కుల పరిరక్షణకు పాటు పడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

6 గ్యారంటీల కోసం ప్రజలు వేచి చూస్తున్నారు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఉచిత వైద్య సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అమీర్‌పేట 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్యక్రమం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజోపయోగమైన కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దశరథ్, ఆరోగ్యశ్రీ అధికారి దశరథ్‌సింగ్, తహసీల్దార్ భీమయ్యగౌడ్, కూకట్‌పల్లి బస్ డిపో డీఎం ఇషాక్, బీఆర్ఎస్ నాయకులు గులాబ్‌సింగ్, గోపీలాల్‌చౌహన్, రాణికౌర్ సంతోష్, నర్సింహ, బల్‌రాం, పీయూష్‌గుప్తా పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే..



ఎస్ఆర్‌నగర్‌లోని వినాయక దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.ఈ కల్యాణ మహోత్సవానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరవ్వగా ఈఓ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్యేను సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్‌రావు, సంధ్యారాణి, శివ, కళ్యాణ్,శ్రీనివాస్‌యాదవ్, షాబాద్ సత్యనారాయణ, గులాబ్ సింగ్, గోపీలాల్ చౌహన్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు !



బౌద్ధనగర్: అంబర్‌నగర్‌లోని మార్కండేయ దేవాలయం సమీపంలో రెండేళ్ల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్డును తవ్వి పనుల అనంతరం మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం తవ్విన రోడ్డుకు నేటికీ మరమ్మతులు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

'విద్యా వలంటీర్ల పెండింగ్ జీతాలివ్వండి'

బంజారాహిల్స్: గత ప్రభుత్వం 2020 విద్యా సంవత్సరంలో విద్యా వలంటీర్లకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు ఇంకా ఇవ్వలేదని మూడేళ్లు గడుస్తున్నా చాలా మందికి జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీసం ఈ ప్రభుత్వంలోనైనా బకాయిలు చెల్లించాలని రాష్ట్ర విద్యా వలంటీర్ల టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు బానోతు శివలాల్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి హప్సా తదితరులు ఆదివారం ఆర్థిక శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్కను సంప్రదించి వినతి పత్రం అందజేశారు. గతంలో తమ సమస్యలపై ఎన్నోసార్లు సీఎల్పీ లీడర్‌గా ఉన్నప్పుడు ఆయనను కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కరోనా సమయంలో విద్యా వలంటీర్లను గత ప్రభుత్వం అర్థాంతరంగా తొలగించి అన్యాయం చేసిందని ఆరోపించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా వలంటీర్లు అందరినీ మళ్లీ ఈ ప్రభుత్వంలో రెన్యువల్ చేయాలని పెండింగ్‌లో ఉన్న జీతాలు వచ్చేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. 16 వేల విద్యా వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడిన విషయాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

హక్కులపై మరింత చైతన్యం అవసరం

హిమాయత్‌నగర్: మానవ హక్కుల పట్ల ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ... రాజ్యాంగం ప్రజలకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా ఇచ్చిందని... వాటికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విద్య అన్నింటికీ మూలమని, విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ విద్య ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చట్టం కఠినంగా శిక్షిస్తుందనే విషయాన్ని మరచిపోవద్దని, చట్టం ప్రతి ఒక్కరికీ సమానమే అని జస్టిస్ చంద్రయ్య స్పష్టం చేశారు. కౌన్సిల్ చైర్మన్ మహమ్మద్ షేక్‌షా మాట్లాడుతూ... హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా మానవ హక్కులపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు. వినోద్ కుమార్, ఆస్మా, సలీమ్, అక్రమ్ పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

లిబర్టీ: మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ అన్నారు. రాజ్యాంగ హక్కులను రక్షించుకోవాలని దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... కనీసం జీవించే మానవ హక్కులు దళిత బహుజన కుల అందటం లేదన్నారు. పార్టీ నాయకులు దేవుని శ్రీనివాస్, బీరం సతీష్‌కుమార్, ఇటికాల గణేష్ పాల్గొన్నారు.